క్లుప్తంగా

నేడు నమామి సాయి శత రుద్రీయం

జియ్యమ్మవలస: భగవాన్ సత్యసాయి జన్మదినం సందర్భంగా గరుగుబిల్లి మండలం రావివలసలో శనివారం నమామి శత రుద్రీయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 74వ ఏకాదశి రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 120 మంది వేదపండితులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 5.45 గంటలకు చేపట్టే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.
గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నమామి సాయి శత రుద్రీయంలో భాగంగా 74వ రుద్రీయంను శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు పి.నేతాజీనాయుడు శుక్రవారం తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహించే రుద్రీయంలో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి హిందీ ప్రచార సభ పరీక్షలు

కురుపాం: హిందీ ప్రచార సభ (హైదరాబాద్) పరీక్షలు ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్‌కుమార్ పండా శుక్రవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారద, భూషణ్, విద్వాన్ స్థాయిలో పరీక్షలు ఉంటాయన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం తోట శంకరరావు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎంఈఓ సత్యనారాయణ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు

కొమరాడ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గుంపస్వామీశ్వరుడిని దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు శిబిరాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. పలువురు భక్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున భక్తులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీరు ఎక్కువగా తాగాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

నేడు చిదిమి సచివాలయం ప్రారంభం

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటు యు.వెంకమ్మపేట, చిదిమి సర్పంచ్‌లు సొంట్యాన లక్ష్మి, దమలపాటి ఉమామహేశ్వరరావు ఉన్నారు.

శఠగోపం బహూకరణ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని కైలాసనాథ స్వామి ఆలయానికి వెండి శఠగోపాన్ని ఆలయ పూర్వ అర్చకులు ఇప్పిలి నరసింహశర్మ శుక్రవారం స్వామివారికి బహూకరించారు. 350 గ్రాముల వెండి శఠగోపాన్ని ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావుకు అందజేశారు.

పైపులైన్ మరమ్మతులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో కుళాయి మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టారు. రెండు రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ కొల్లి సత్యంనాయుడు ఆధ్వర్యంలో బోర్ మెకానిక్ లోలుగు తిరుపతిరావు మరమ్మతులు చేపట్టారు. కుళాయి పైపులైన్‌కు రంధ్రం పడడంతో మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు.

సెలక్షన్ కమిటీ సభ్యునిగా తిరుపతిరావు

భామిని: మండలం సొలికిరికి చెందిన బీజేపీ నాయకుడు కొత్తకోట తిరుపతిరావును నేషనల్ యూత్ వలంటీర్స్ సెలక్షన్ కమిటీ సభ్యునిగా నియమించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా యూత్ అధికారి కె.వెంకట్ ఉజ్వల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు ఎంపిక కమిటీలో సభ్యునిగా తిరుపతిరావుకు స్థానం కల్పించారు. ఆయన ఇప్పటికే బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తిరుపతిరావు నియామకంపై పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మండల రాంబాబు, టంకాల వాసుదేవరావు హర్షం వ్యక్తం చేశారు.

సర్పంచ్ మృతికి సంతాపం

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామ సర్పంచ్ దేవుపల్లి కళావతి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, మండల కన్వీనర్ డి.జనార్దనరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హరహర మహాదేవ..


కొమరాడ: శ్రీస్వామిశ్వరుడు ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ శివ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మహాశివుడికి క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించి భక్తులకు అన్నసమారాధన చేశారు. పలువురు భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, రాత్రంతా జాగారాలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. వీరఘట్టం మండలం వండవలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, కురుపాం మండలం గుమ్మ గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు ప్రత్యేక పూజలు చేశారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్


వీరఘట్టంలోని ఉమాసోమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


పాలకొండ: సనారి విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు


పాలకొండ రూరల్: తంపటాపల్లిలో భక్తులచే పూజలు అందుకుంటున్న ఉమా మహేశ్వర, వీరభద్రస్వామి


గరుగుబిల్లి: జీవీపురంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


జియ్యమ్మవలస: వెంకటరాజపురంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


కురుపాం: గొత్తిలి మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


భామిని: శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు


గుమ్మలక్ష్మీపురంలోని నామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సీతంపేట: కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు


పాలకొండ: భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలో భక్తులు


భామిని: నేరడి శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు


కురుపాం: గుమ్మ గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తుల తాకిడి

పేదల సొంతింటి కల నెరవేర్చాం..

- ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక మేజరుపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ మహిళా దినోత్సవం నాడు 330 మంది అక్కచెల్లమ్మలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక టీడీపీ పొత్తులంటూ జిత్తులమారి వేషాలు వేస్తోందన్నారు. వారికి తోడు పచ్చమీడియా నిత్యం విష పురాతలతో ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలు, పచ్చ మీడియా కలిసి ఎన్ని జిత్తులమారి వేషాలు వేసినా రానున్న ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మనకు శ్రీరామరక్ష అన్నారు. రానున్న 40 రోజులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ గడపకు వెళ్లి వారికి ఈ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు వివరించాలని సూచించారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు కావాలంటే నాయకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగేవారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఎక్కడా లేదని అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి ఆయన రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల క్రితం వీరఘట్టం–వంగర మండలాలను అనుసంధానం చేస్తూ కిమ్మి–రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై చేపట్టిన వంతెన పనులను గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడంతో పనులు ముందుకు సాగకుండా నిలిచిపోయాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసిందని గుర్తుచేశారు. ఈ వంతెనను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 11న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ పులిటి గౌరమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు, పార్టీ పట్టణ అధ్యక్షురాలు దిబ్బ లలితకుమారి, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోగి లత, బోగి మణి, బూరాడ చిన్న, పిన్నింటి దుర్గారావు, బోగి మదన్, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

కేంద్ర బలగాల కవాతు

పాలకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిలో శుక్రవారం సాయంత్రం పోలీసులు కవాలు నిర్వహించారు. డీఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లో అన్ని ప్రధాన కేంద్రాల్లోను పోలీసు బలగాలు పహరా నిర్వహిస్తున్నాయన్నారు. నేరాల నియంత్రణకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

మొండెంఖల్ గ్రామంలో..

కురుపాం: మండలంలోని తూర్పుముఠా ప్రాంతమైన మొండెంఖల్ గ్రామంలో ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రత్యేక పోలీసు బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రత్యేక బలగాలతో భద్రత ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు.


పాలకొండ: కవాతు చేస్తున్న పోలీసులు


కురుపాం: మొండెంఖల్ గ్రామంలో పోలీసుల కవాతు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



పాలకొండ రూరల్: మహిళా అధ్యాపకులను సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది



పాలకొండ: మహిళలకు ఎంబ్రాయిడరీ టూల్‌కిట్లు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకొండ రూరల్: స్త్రీమూర్తి శక్తి స్వరూపిణి అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం సహచర ఉద్యోగినిలతో పాటు ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు రౌతు భారతిని ఘనంగా సన్మానించారు. సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, విద్యార్థినులు ఉతన్న లక్ష్యాలను అధిరోహించేలా ప్రణాళికతో ముందుకు సాగాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, ఆధ్యాపకులు శాంతి, పి.రాజ్యలక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.
పాలకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీతంపేట డిప్యూటీ తహసీల్దార్ శ్రీవిద్య అన్నారు. న్యూహోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. న్యూహోప్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పొందాలని కోరారు. ఈ సందర్భంగా 30 మంది మహిళలను సన్మానించి, ఎంబ్రాయిడరీకి సంబంధించిన టూల్‌కిట్లు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బీఎస్ బెన్హర్, పి.తులసమ్మ, యూని గాంధీ, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.
కురుపాం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో నేరేడువలసలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక, వ్యాపార, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో మరింత ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టమ్మ, కురుపాం జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు తిమ్మ సునీత, గౌడు సంతోషి, కురుపాం, కిచ్చాడ గ్రామ సర్పంచ్‌లు గార్ల సుజాత, గవర రాజ్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కొండబారిడి గిరిజన గ్రామంలో జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు.


కురుపాం: మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి



కురుపాం: మహిళా దినోత్సవం సందర్భంగా కొండబారిడిలో మహిళల ర్యాలీ